సాక్షి సూర్యాపేట

ఆదివారం । 31 । మార్చి । 2024



సముచిత స్థానం కల్పించాలి

బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.


- 8లో



మహిళల పాత్ర కీలకం

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకమని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు.

- 8లో



న్యూస్‌రీల్

సవాళ్లతో కూడుకున్నదే పోలీసు ఉద్యోగం



ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: ఎస్ఐ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా వారి దంపతులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డే సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం నిత్యం సవాళ్లతో కూడుకున్నదని, కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలు అందించాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సభ్యులు అంజన్‌రెడ్డి, వెంకయ్య, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ హోదాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లత కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విధుల్లో ఉన్న ఉద్యోగులు ముందుగా ఫామ్12–డి ని పొందాలని, తదుపరి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని చెప్పారు. తదుపరి పోలీస్, విద్యుత్, హెల్త్, ఆర్‌టీసీ, పౌర సరఫరాలు, అగ్నిమాపక, సమాచార, రవాణ శాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నోడల్ అధికారులు ఎఫ్‌డీఓ రూపేందర్ సింగ్, ఆర్డీఓ సురేష్ రెడ్డి, డీఎఫ్ఓ (ఫైర్) షణ్ముఖ రావు, ఆర్టీసీ డీఎం సురేందర్, విద్యుత్ శాఖ డీఈ నాయుడు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న డేవిడ్ కుమార్

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): సమాజంలోని అసమానతలు పోయి ప్రతి మనిషి స్వేచ్ఛగా బతకడమే స్వాతంత్ర్యమని చెప్పిన భగత్ సింగ్ ఆశయ సాధనకు నేటి యువత పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోశాధికారి బండి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల సైదులు, కంచనపల్లి సైదులు, నల్గొండ నాగయ్య, దేశోదు మధు, పిడమర్తి భరత్, ఉమేష్, వెంకన్న, అశోక్, బోల్క పవన్, సుధాకర్, ఎల్లయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హసేన్

భానుపురి (సూర్యాపేట): మాల కులస్తులే రిజర్వేషన్లు పొందుతున్నారని మందకృష్ణ మాదిగ, కొంత మంది ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలకు ఎంపీ టికెట్స్ ఇవ్వరాదని, తాము కోరిన వారికి ఎంపీ టికెట్స్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ కాంగ్రెస్ పార్టీని బ్లాక్ మెయిల్ చేయడం సరికాదన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు బొల్లెద్దు గోపయ్య, ఏడిండ్ల అశోక్, గాజుల నర్సయ్య, పెరుమాళ్ల రాజారావు, వెంకట నర్సయ్య, అనుములపురి సైదులు, పిండిగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు

ముగిసిన టెన్త్ పరీక్షలు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 18న పరీక్షలు ప్రారంభమయ్యాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 67 పరీక్ష కేంద్రాల్లో 11,946 మంది విద్యార్థులకు 11,905 మంది హాజరయ్యారు. 41మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా స్థాయి పరిశీలకులు సీహెచ్ రమణకుమార్, డీఈఓ అశోక్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. ఒకేషనల్ విద్యార్థులకు ఏప్రిల్ 1న 13 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

గెలుపు కాంగ్రెస్‌దే..

ప్రత్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కవు



మట్టపల్లిలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, వేదికపై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, కోమటిరెడ్డి, తుమ్మల, జానా, ఆర్డీఆర్, ఎమ్మెల్యేలు, అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మట్టపల్లిలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం
- హాజరైన రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, మాజీ మంత్రులు జానారెడ్డి, ఆర్డీఆర్, అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

హుజూర్‌నగర్/మఠంపల్లి : త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ ఎంపీ స్థానం పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం చేయించినట్లు తెలిపారు. ఎంపీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ రోజు నుంచే సమన్వయంతో పనిచేసి అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి ఘన విజయం అందించాలని కోరారు. ప్రత్యర్థి పార్టీలకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. రానున్న ఐదేళ్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

రఘువీర్‌రెడ్డి గెలుపుతో అభివృద్ధి : జానారెడ్డి

జిల్లాలో ఆగిపోయిన అభివృద్ధి కొనసాగాలంటే నల్లగొండ ఎంపీగా రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కోరారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో కులాలు, మతాలకు అనుగుణంగా తనను అభిమానించారని పేర్కొన్నారు. నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు, భేదాభిప్రాయాలు ఎన్ని ఉన్నా రఘువీర్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తామనడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు.

దేశంలోనే అత్యధిక మెజార్టీ రావాలి : ఆర్డీఆర్

రఘువీర్‌రెడ్డికి దేశంలోనే అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కోరారు. ఇందుకోసం బూత్ లెవల్, గ్రామ, మండల స్థాయి కమిటీలు విస్తృతంగా సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి : ఎమ్మెల్యేలు

దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రఘువీర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కష్టనష్టాలకు ఓడ్చి పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. నల్లగొండ, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటివెంకన్నయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, నాయకులు సాముల శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మంజూనాయక్, యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్, ఎంపీపీలు గూడెపు శ్రీను, భూక్య గోపాల్, డీవీ. సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, గెల్లి రవి, పలువురు మహిళా నాయకురాళ్లు, పాల్గొన్నారు.

30 వేల ఉద్యోగాలు ఇచ్చాం : మంత్రి కోమటిరెడ్డి



మూడు నెలల్లో 30వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇస్తున్నాం అని, మీరు ఏనాడైనా ఇచ్చారా అని బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు. హరీష్‌రావు, కేటీఆర్ అధికారం కోల్పోయిన బాధతో ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. కరువు యాత్రల పేరుతో కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు: కుందూరు రఘువీర్‌రెడ్డి

పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసినా తట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు.



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

సన్నాహక సమావేశం సక్సెస్

మట్టపల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమాశం సక్సెస్ అయ్యింది. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హెలికాప్టర్‌లో రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వచ్చారు.వారికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి ఉత్తమ్ ధన్యవాదాలు తెలిపారు.

రైతుల దగ్గరకు కేసీఆర్

నేడు ఉమ్మడి నల్లగొండలో పర్యటించనున్న గులాబీ బాస్



విలేకరులతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

- ఎండిన పంటలను పరిశీలించి రైతులకు ఓదార్పు
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ యంత్రాంగం



నల్లగొండ : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. నీళ్లందక ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకొని వారిలో ధైర్యం నింపనున్నారు. అధినేత పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

పొలాలు ఎండుతున్నా ప్రభుత్వానికి సోయి లేదు : జగదీశ్‌రెడ్డి

పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి సోయి లేదని, ఇప్పటి వరకు సమీక్ష కూడా నిర్వహించలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం నల్లగొండలో ఎంపీ బడుగులలింగయ్య యాదవ్, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలనమీద పట్టు లేదని, పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎండిన పంటలపై ఏ ఒక్క మంత్రి కూడా ఇప్పటి వరకు సమీక్షలు నిర్వహించకపోవడం రైతుల పట్ల వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తేటతెల్లం అవుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కేసీఆర్ సీఎంగా ఉంటే భూమి, ఆకాశాన్ని ఒక్కటి చేసైనా రైతాంగానికి నీరందించేవారని పేర్కొన్నారు. కేసీఆర్‌కు ఆరోగ్యం సహకరించకపోయినా.. అన్నదాత కష్టాలను చూడలేక ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించేందుకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల ఎకరాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మొత్తుకుంటున్నా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు ఆగమయ్యారని, కేసీఆర్‌పై కోపంతో వారిని బలిచేస్తున్నారని ఆరోపించారు. నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా తమ ప్రభుత్వం రైతులకు నీరందించి రైతులను కాపాడుకున్నామని గుర్తు చేశారు. ఎస్ఆర్‌ఎస్‌పీ కింద సూర్యాపేట జిల్లాలో నీరిస్తాం, పంటలు సాగు చేయాలని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. జిల్లా మంత్రులు వసూళ్ల, దందాలు మొదలుపెట్టారని, బెదిరింపులకు పాల్పడుతూ మిల్లర్ల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో మిల్లర్లు ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు అన్నదాతలను పీక్కుతింటున్నారని ధ్వజమెత్తారు. కోమటిరెడ్డి ఓ బుడ్డర్‌ఖాన్, ఓ జోకర్ అని.. ఆయన మాటలకు విలువే లేదని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ పర్యటన సాగుతుంది ఇలా..

కేసీఆర్ ఆదివారం ఉదయం ఎర్రవెల్లిలోని తన ఫాంహౌజ్ నుంచి బయలుదేరి జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్‌తండాకు చేరుకుంటారు. తండాలో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. ఆ తరువాత సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, అర్వపల్లి మండలాల్లో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఓదారుస్తారు. అనంతరం సూర్యాపేట మండల శివారు గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారు. ఆ తరువాత సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం మీడియాతో మాట్లాడుతారు. అక్కడి నుంచి నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం చేరుకుని ఎండిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. అనంతరం నల్లగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల నుంచి భువనగిరి మీదుగా ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు చేరుకుంటారు.

సూర్యాపేటలో రన్ ఫర్ జీసస్



భానుపురి: సూర్యాపేట పట్టణంలో శనివారం సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

మఠంపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ఏసుక్రీస్తు పునరుత్థానం సందర్భంగా మఠంపల్లి శుభవార్త చర్చిలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పెరిగిన ఉపాధి కూలి

- రూ.272 నుంచి రూ.300కు పెంచిన కేంద్రం
- గతంలో కంటే రూ.28 పెరుగుదల
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు
- జిల్లాలో 2,61,192 కుటుంబాలకు లబ్ధి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు దినసరి కూలిని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోజువారీగా ఒక్కో కూలీకి రూ.272 కూలి చెల్లిస్తున్నారు. కాగా దీనికి కేంద్ర ప్రభుత్వం మరో రూ.28 పెంచి రూ.300గా నిర్ణయించింది. పెంచిన వేతనం ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానున్నది.

2.61లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలోని 23 మండలాల్లో 2,61,192 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటిలో 5,69,350 మంది కూలీలు నమోదై ఉన్నారు. కాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,83,547 జాబ్ కార్డులకు సంబంధించి 3,46,086 మంది కూలీలకు 55లక్షల దినాల పనులు కల్పించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ 34,881 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.



ఏటా పెరుగుతున్న కూలి

ఏటా ఉపాధి కూలీల దినసరి కూలిని ప్రభుత్వం పెంచుతూ వస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు రోజువారీగా రూ.258 కూలి చెల్లిస్తుండగా దాన్ని 2023–24 సంవత్సరంలో రూ.272కు పెంచింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గతంలో దానికంటే రూ.28 పెంచి రూ.300 చేసింది. పెరిగిన కూలి ఏప్రిల్ 1నుంచి అమలులోకి రానుంది. కానీ, కూలీలు చేసిన పనికి పని ప్రదేశాల్లో కొలతల ఆధారంగా కూలి చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సవత్సరంలో రోజువారి కూలి రూ.272గా నిర్ణయించినప్పటికీ జిల్లాలో సరాసరి రోజుకు రూ.175 మాత్రమే అందింది. అయితే ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారి కూలి రూ.600లకు పెంచాలని, ప్రతిఒక్కరికీ ఏడాదిలో 200 రోజుల పాటు పని కల్పించాలని కూలీలకు కోరుతున్నారు.

గోదావరి నీటి విడుదల మరికొద్ది రోజులు పెంపు

అర్వపల్లి: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ ఆయకట్టుకు నీటి విడుదల షెడ్యూల్ ప్రకారం శనివారంతో పూర్తయింది. ఈ సీజన్‌లో ఆరు విడతలుగా నీటిని పంటలకు విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించిన షెడ్యూల్ మేరకు జనవరి 8న మొదటి తడిగా వారబందీ విధానంలో నీటిని విడుదల చేశారు. చివరి తడిగా ఆరో విడత ఈ నెల 23 నుంచి 30 వరకు ఇస్తామని ప్రకటించిన విధంగానే నీటిని వదిలారు. అయితే గడువు ముగిసినప్పటికీ చివరి భూములకు నీళ్లు అందకపోవడం, కాలువ వెంట గ్రామాలకు నీళ్లు సరిపోను రాక వరి పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గమనించిన నీటి పారుదల శాఖ అధికారులు పైఅధికారులతో మాట్లాడి నీటి విడుదల గడువు పెంచారు. ఏప్రిల్ 5 వరకు నీళ్లు ఇవ్వాలని అధికారులను కోరామని బయ్యన్నవాగు డీఈఈ సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం నీళ్లు జిల్లాకు యథావిధిగా వస్తాయని చెప్పారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో తోట దగ్ధం



దగ్ధమైన మామిడి చెట్లు

రామన్నపేట : నిప్పంటుకొని కొబ్బరి, మామిడితోట దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపురం గ్రామ శివారులోని కొత్తకాపు శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 35ఎకరాల భూమిని మునిపంపుల గ్రామానికి చెందిన శిరిషాల యాదగిరి ఐదు సంవత్సరాలుగా కౌలుకు తీసుకొని చెరకు, వరి, కూరగాయలు, పూలు సాగు చేస్తున్నాడు. సుమారు పది ఎకరాల్లో కొబ్బరి, మామిడితోట కలదు. ఏడాదికి ఐదులక్షల చొప్పున కౌలు చెల్లిస్తున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో తోటకు నిప్పంటుకుంది. ప్రమాదంలో ఆరు ఎకరాలలోని కొబ్బరిచెట్లతో పాటు, బా గా కాసిన మామిడిచెట్లు డ్రిప్‌పైప్ పరికరాలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ 3లక్షల పంట నష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

సారా విక్రయదారుల బైండోవర్

మద్దిరాల : మండల పరిధిలోని మామిండ్లమడవ ఆవాస పిర్యా తండా, ధరావత్ తండాకు చెందిన ఆరుగురు వ్యక్తులు సారా అమ్ముతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించి వారిని శనివారం తహసీల్దార్ అమీన్‌సింగ్ వద్ద బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మరోసారి సారాయి అమ్మినట్లు గుర్తిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

నార్కట్‌పల్లి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 17 స్థానాలకు గాను బీసీలకు 5 టికెట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గుణపాఠం నేర్చుకున్నట్లుగా 6 సీట్లు కేటాయించడం మంచి పరిణామంగా ప్రశంసించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో కీలకపాత్ర వహించిన బీసీలకు పార్లమెంటు ఎన్నికల్లో 9 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో హైదరాబాద్‌లో అన్ని పార్టీల నాయకులతో ముఖ్య సమావేశం నిర్వహించి త్వరలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరగకుంటే ప్రత్యేక కార్యాచరణ తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో బీసీలకు అన్యాయం జరిగితే మౌనంగా ఊరుకోరని కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నర్సింహ, మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారపు సత్తయ్య, బోయపల్లి శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల మధు, మహేంద్రచారి, వీరేశం, ముద్దం మధు, జజ్జుల పోతయ్య, లింగస్వామి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

చిట్యాల : రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎస్‌ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసం ఉండే కంచనపల్లి మోహనచారి తన తల్లి రమాదేవి, చెల్లి సూరోజు గాయత్రిలతో కలిసి సూర్యాపేటకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో చిట్యాల పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గల ఎక్స్ రోడ్డులో వీరు ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో ఆ కారును ఆ పక్కనే ఉన్న రాఖీ కారు రిపేరింగ్ సెంటర్ వద్ద పెట్టి ఆర్టీసీ బస్సులో సూర్యాపేటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. బస్సులు సకాలంలో రాకపోవటంతో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు గాను ముగ్గురు జాతీయ రహదారిని దాడుతున్నారు. ఈ సమయంలో నార్కట్‌పల్లి నుంచి చిట్యాల పట్టణం వైపునకు వెళుతున్న థార్ కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి రోడ్డు దాడుతున్న రమాదేవి(49)ని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమాదేవిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి కుమారుడు మోహనచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

ఆలేరురూరల్ : ఉరేసుకుని పూజారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శుభం పాండే(32) ఆలేరు పట్టణ కేంద్రంలోని సాయి బాబా ఆలయంలో కొన్ని రోజుల నుంచి పూజారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తెల్లవారుజామున ఆరున్నర గంటలకు శుభం విధులకు హాజరు కానందున గుడి వాచ్‌మన్ తోట పాపయ్య తన ఆలయం పక్కనే ఉన్న పూజారి గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆర్థిక ఇబ్బందులతో శుభం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి బాబాయ్ శ్రీరామ్ పాండే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు. మృతుడికి వివాహం జరిగి పదకొండు నెలలు అవుతుందని తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లగిరి గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన గుర్రాల సుదర్శన్(52) కుటుంబసభ్యులతో కలిసి జీవనోపాధి నిమిత్తం కొంత కాలం క్రితం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు వెళ్లారు. భార్య అనసూయ స్థానికంగా కూలి పనులు చేస్తుండగా, భర్త హయత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్‌హౌజ్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సూర్యాపేటలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకుగాను శుక్రవారం ఉదయం 6గంటలను ఇంటి నుంచి బయలుదేరాడు. శుభకార్యం ముగిశాక అదే రోజు సాయంత్రం తిరుగప్రయాణం అయ్యాడు. ఆ క్రమంలో సూర్యాపేటలో ఓ డీసీఎం వాహనం ఎక్కాడు. రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లగిరి స్టేజీ వద్దకు డీసీఎం చేరుకుంది. అక్కడే ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి డీసీఎం వద్దకు వెళ్తున్నాడు. ఆ క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపుకు వెళ్తున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు చౌటుప్పల్‌కు చెందిన యువకుడిగా గుర్తించారు. ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం.

మార్కెట్‌కు భారీగా ధాన్యం రాక



తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా 13466 బస్తాల ధాన్యం శనివారం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ధాన్యానికి గరిష్టంగా క్వింటాళ్‌కు రూ.2016, కనిష్టంగా క్వింటాళ్‌కు రూ.1600 ధర పలికినట్లు తెలిపారు.

చెక్ పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న నల్లగొండ కలెక్టర్,ఎస్పీ

నల్లగొండక్రైం: జిల్లాలో అన్ని చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహించి ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా కాకుండా కట్టడి చేస్తున్నట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. జిల్లాలోని అంతర్ రాష్ట్ర జిల్లా లోపల ఉన్న చెక్ పోస్టులను శనివారం కలెక్టర్‌తో కలిసి తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటలు సిబ్బంది తనిఖీలు చేస్తున్నారని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా వీడియో చిత్రీకరణల ద్వారా నగదు, మద్యం సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.7.19 కోట్ల విలువ గల నగదు, మద్యం ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సువిధ యాప్ ద్వారా ముందస్తుగానే అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళితే అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు కమిటీ ద్వారా తగిన ఆధారాలు చూపి విడుదల చేసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీసీ కెమెరాలతో మరింత నిఘా పెడుతున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్సైజ్ పోలీసులపై దాడి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఎక్సైజ్ పోలీసులపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన చింతలపాలెం మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్త గూడెంతండాకు చెందిన గుగులోతు తులసీరాం సారా కేసులు నిందితుడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన ఎక్సైజ్ ఎస్‌ఐ దివ్య, పోలీసులపై నిందితుడు సీతారాంతో పాటు భూక్యా సరస్వతి దాడికి పాల్పడి రాళ్లు రువ్వారు. దీంతో జీపు అద్దాలు పలిగాయి. ఎక్సైజ్, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఎస్‌ఐ దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

చండూరు ఎంపీపీ రాజీనామా



రాజీనామా లేఖ అందజేస్తున్న ఎంపీపీ

చండూరు : చండూరు మండల పరిషత్ అధ్యక్షురాలు పల్లె కళ్యాణి రవి కుమార్ తన పదవికి శనివారం రాజీనామా చేశారు. జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి కి ఆమె తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.9 మంది ఎంపీటీసీ సభ్యులు గతంలో అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు లేఖను అందించారు. దీంతో ఎంపీపీ కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు స్టే ఎత్తి వేయడం మూలంగా ఆర్‌డీఓ ఏప్రిల్ 1న మండల పరిషత్ అధ్యక్ష పదవికి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ముందస్తుగా ఆమె రాజీనామా చేశారు.

తండ్రి చనిపోయిన బాధలోనూ ..



పదో తరగతి పరీక్ష రాస్తున్న నిఖిలా సుజన్

నల్లగొండ : తండ్రి చనిపోయిన బాధలోనూ పదో తరగతి వార్షిక పరీక్షకు హాజరైంది ఓ విద్యార్థిని. వివరాలు.. నల్గొండలోని బాప్టిస్టు చర్చి పాస్టర్ చంద్రదాస్‌కు ఇటీవల గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. గురువారం రాత్రి చనిపోగా శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈయన కూతురు కూతురు నిఖిలా సుజన్ పుట్టెడు దుఃఖంలోను శనివారం సాంఘిక శాస్త్రం చివరి పరీక్ష రాసింది. చర్చి పాస్టర్ అయిన చంద్రదాస్ గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రార్థనలు చేయాల్సి ఉండగా అదే రోజు చనిపోవడం కుటుంబాన్ని దుఃఖ సాగరంలో ముంచెత్తింది. ఒక పక్క క్రీస్తు చనిపోయిన రోజు కావడం అదే రోజు ఫాస్టర్ చనిపోవడంతో చర్చిలోను విషాద ఛాయలు అలుముకున్నాయి.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

భువనగిరి క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెలతాడును చోరీ చేశారు. ఈ ఘటన భువనగిరి మండలంలోని హన్మపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. హన్మపురం గ్రామానికి చెందిన రంగ సీలమ్మ ఇంటి బయట మరో మహిళతో మాట్లాడుతుండగా వెనుక నుంచి దుండగులు వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడు తీసుకుని పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా వివరాలను సేకరించి అనంతారం క్రాస్ రోడ్డు వద్ద బొమ్మలరామారం మండలం పక్కీరుగూడెంకు చెందిన గంగరేగు సాగర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసింది తానేనని ఒప్పుకున్నాడు. ఇంటర్ చదివిన సాగర్ చదువు మాని ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. తాగడానికి డబ్బులు లేకపోవడంతో వద్దురాలు రోడ్డు మీద ఉండగా మెడలో నాగులు తులాల పుస్తెలతాడు లాక్కొని పోయాడు. మంగళసూత్రాన్ని అమ్మడానికి వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సెల్‌ఫోన్, పల్సర్ బైక్, పుస్తెలతాడు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

పీఏపల్లి ఎంపీపీపై వీగిన అవిశ్వాసం



అవిశ్వాసం వీగినట్లు ప్రకటిస్తున్న ఆర్డీఓ



బాణసంచా కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం శనివారం వీగిపోయింది. గతేడాది డిసెంబర్ 11న ఎంపీపీపై 10మంది ఎంపీటీసీలు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములుకు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు. దీంతో ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాసం వాయిదా పడింది. ఏప్రిల్ 2వ తేదీ లోపు అవిశ్వాసం పూర్తి చేయాలని హైకోర్టు ఈనెల 12న తీర్పునిచ్చింది. దీంతో ఆర్డీఓ నేతృత్వంలో పీఏపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 1.30 నిమిషాల వరకు అవిశ్వాసంపై ఓటింగ్‌కు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు ఆర్డీఓ ప్రకటించారు. అయితే గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఎనిమిది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఎంపీటీసీలు విజయం సాధించారు. కాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు ఎంపీటీసీలు ఆ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం పదికి చేరడంతో అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ప్రతాపరెడ్డి కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన మరో ఎంపీటీసీని క్యాంపునకు తరలించడంతో బీఆర్‌ఎస్ బలం ఏడుకు చేరింది. దీంతో అవిశ్వాసానికి అవసరమైన తొమ్మిది మంది ఎంపీటీసీలు కాంగ్రెస్ శిబిరంలో లేకపోవడం సభ్యులెవరూ హాజరు కాకపోవడంతోఅధికార కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. దీంతో ఎంపీపీని నిలబెట్టుకున్న బీఆర్‌ఎస్ మండల శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

మర్రిగూడ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న ఎంపీటీసీలు

మర్రిగూడ: మర్రిగూడ మండల ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై పలువురు ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం శనివారం నెగ్గింది. వివరాల్లోకి వెళ్తే.. గతంలో వివిధ గ్రామాలకు చెందిన గండికోట రాజమణిహరికృష్ణ, కట్కూరి వెంకటేష్‌గౌడ్, సిలివేరు విష్ణు, ఏర్పుల శ్రీశైలం, వెన్నమనేని శోభారవీందర్‌రావు, తుమ్మల వరప్రసాద్, దాసరి మమతగోపాల్, నేనావత్ బంతాలాల్‌తో కలిపి ఎనిమిది మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చారు. దీంతో ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకోవడంతో ప్రక్రియ వాయిదా పడింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం మర్రిగూడ ఎంపీడీఓ కార్యాలయంలో చండూరు ఆర్డీఓ డి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. దీనికి ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డితోపాటు ఎంపీటీసీలు దంటు జ్యోతి జగదీశ్వర్, ఊరిపక్క సరితనగేష్‌లు గైర్హాజరయ్యారు. ఎనిమిది మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి సానుకూలంగా చేతులు ఎత్తి మద్దతు తెలపడంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లుగా ఆర్డీఓ ప్రకటించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించి జెడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు కొత్త ఎంపీపీ ఎన్నికకు త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరో రెండు వారాల్లో నూతన ఎంపీపీ ఎన్నిక ఉంటుందని సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి సీఐ ఎ.నవీన్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్కా శ్రీనివాసులు, ఎంపీడీవో జి.చినమునయ్యలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్



సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

నకిరేకల్: వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకమని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. నకిరేకల్‌లోని నర్రా రాఘవరెడ్డి స్మారక భవనంలో శనివారం జరిగిన మహిళా రైతు విభాగం రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో మహిళలు రోజుకు 12 గంటల నుంచి 15 గంటల పని చేస్తున్నారని గుర్తు చేశారు. పురుషులతో పోల్చినప్పుడు మహిళలు తెచ్చే ఆదాయం తక్కువగా కనిపిస్తుందని చెప్పారు. దీని కోసం పురుష రైతులకు కల్పించే అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను మహిళా రైతులకూ వర్తింప చేసేలా ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి, ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళలకు సాంకేతిక సామర్థ్యాన్ని పెంచటానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రత్యేకంగా వీరి శక్తి సామర్థ్యాలను గుర్తించడం కోసం నిపుణల బృందంతో కూడిన కమిటీని ఏర్పాటుచేసి వారి సమస్యలపై అధ్యయనం చేసి వారి సమస్యలను పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అంతకుముందు ఆ విభాగం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల పతాకాన్ని ఎగురవేశారు. సదస్సులో పలు తీర్మానాలు చేశారు. సదస్సులో నకిరేకల్ మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, రైతు సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొప్పుల రజిత,కంచర్ల ఊర్మిళ, నాయకులు గింజల లక్ష్మి, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, వీరవెల్లి వెంకటేశ్వర్లు, వేమూరి సుజాత, సుశీల, అలివేలు, రోహనాబేగం, మాజీద్, నాగమణి, జిట్టా సరోజ, మక్క మేరమ్మ, కోనేటి జ్యోతి పాల్గొన్నారు.

రూ.80 వేల నగదు పట్టివేత



పట్టుకున్న డబ్బులను ప్రత్యేక అధికారికి అందజేస్తున్న పోలీసులు

నడిగూడెం : మునగాల మండలం కృష్ణానగర్‌కు చెందిన కేతావత్ శంకర్ శనివారం నడిగూడెం నుంచి స్వగ్రామానికి రూ.80 వేల నగదు తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదుకు పంచనామా నిర్వహించి ఎఫ్‌ఎస్‌టీ అధికారి ప్రతాప్‌సింగ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బును తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఆధారాలు ఉండాలని సూచించారు.

గ్యాస్ అక్రమ నిల్వలపై దాడులు



డొమెస్టిక్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్న అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గృహ వినియోగం కొరకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్‌కు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు హెచ్చరించారు.శనివారం సూర్యాపేట పట్టణంలోని మధు గ్యాస్ ఏజెన్సీ, గాయత్రి ఫిల్లింగ్ స్టేషన్, వాసు ఫిల్లింగ్ స్టేషన్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నిల్వ ఉంచిన 20 డొమెస్టిక్ సిలిండలను సీజ్ చేశమని, ఏజెన్సీ నిర్వాహకులపై కేసులు నమోదైనట్లు తెలిపారు.గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్‌కు వినియోగిస్తే, వారిపై చట్ట పరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని అన్నారు. జిలాలోని వ్యాపారస్తులు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాలని సూచించారు. ఈ తనిఖీల్లో సూర్యాపేట డిటి నాగలక్ష్మి, హుజూర్‌నగర్ డీటీ రాజాశేఖర్, ,కోదాడ డీటీ రామిరెడ్డి, తుంగతుర్తి డీటీ విజయ్‌శంకర్, సివిల్ సప్లై ఆర్‌ఐ అస్సాన్ మహమ్మద్‌లు ఉన్నారు.

• కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం



మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మున్షి, మంత్రులు



దీపాదాస్ మున్షిని గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మఠంపల్లిలో హెలిప్యాడ్ వద్ద మంత్రులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

క్లుప్తంగా

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఏప్రిల్ 1వ తేదీన వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు, జర్నలిస్టులు తమ హెల్త్‌కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

రిటైర్డు హెచ్‌ఎంకు వీడ్కోలు



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ఆత్మకూర్(ఎస్) : ప్రధానోపాధ్యాయుడు ధరావత్ శంకర్‌నాయక్ పదవీ విరమణ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వాలి

అర్వపల్లి : చిరు, తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రభుత్వం వడ్డీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను అందించాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిరు వ్యాపారులు చిట్టీల పేరుతో అప్పులు తీసుకొని అధిక వడ్డీలు చెల్లించలేకపోతున్నారని చెప్పారు. చిరు వ్యాపారులను ఆదుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొడ్డు చినలచ్చయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ బూర్గుల రాంబాబు, బొడ్డు వెంకన్న, బొడ్డు భిక్షం, తండ లింగమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నియామకపత్రం అందజేత



నియామకపత్రం అందిస్తున్న సంకినేని

దురాజ్‌పల్లి : భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పెన్‌పహాడ్ మండలానికి చెందిన కేసరి శోభారెడ్డిని నియమిస్తున్నట్లు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శిల్పారెడ్డి ప్రకటించారు. దీంతో శనివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు జిల్లా కేంద్రంలో ఆమెకు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శోభారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంకినేని వెంకటేశ్వరరావు, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల రోజులు తిరిగిరానివి

కోదాడరూరల్ : విద్యార్థులకు పాఠశాల రోజులు తిరిగి రానివని, పాఠశాలలో తమ అనుభవాలను విద్యార్థులు పుస్తకంగా రూపొందించడం అభినందనీయని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు ఒక్కొక్కరు తమ పాఠశాల అనుభవాలను రాయగా వాటిని 'మా బడి జ్ఞాపకాల ఒడి' అనే పుస్తకం రూపంలో రూపొందించారు. ఆ పుస్తకాన్ని డీఎస్పీ శనివారం పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ఎంతో గొప్పదని, ఎంత ఉన్నతమైన చదువులు చదివినా ఇక్కడి స్నేహితులతో అనుబంధాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ రమాదేవి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, తదితరులు

హడలెత్తిస్తున్న వీధి శునకాలు

- గ్రామాల్లో రోజురోజుకూ పెరుగుతున్న కుక్కల దాడులు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం



అర్వపల్లిలోని మెయిన్‌రోడ్డులో ఉన్న కుక్కలు

అర్వపల్లి : వీధి శునకాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పాదచారులే కాకుండా.. ద్విచక్ర వాహనదారులు కూడా వీధుల్లో వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. మెయిన్‌రోడ్లతోపాటు కాలనీలు, గల్లీలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గుంపులుగా అవి తిరుగుతున్నప్పుడు ఎదురుగా ఎవరు కనిపించినా వెంటపడి కరిచి గాయపరుస్తున్నాయి. ఇటీవల మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో నెల రోజుల వ్యవధిలోనే 20 మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారు. మిగిలిన అన్ని గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అర్వపల్లిలోనైతే కుక్కల సమస్య మరింత తీవ్రంగా ఉంది.

ఏడాదిలో 1000 మందికి పైగానే బాధితులు..

జాజిరెడ్డిగూడెం మండలంలో గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 1000 మందికి పైగానే కుక్కల బారిన పడి గాయపడ్డారు. చిన్నా పెద్దా లేకుండా కనిపించిన ప్రతి ఒక్కరిని కుక్కలు వెంట పడి గాయపరుస్తున్నాయి. వీటిని నివారించాలని ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. గతంలో ప్రతి ఏటా వీధి కుక్కల నిర్మూలన కార్యక్రమం చేపట్టే వారు. కానీ ప్రస్తుతం నివారణ, నిర్మూలన.. వాటి గురించే పట్టించుకోడంలేదు. ఇటీవల పలు గ్రామాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను కుక్కలు వెంటపడి గాయపర్చాయి. ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలోకి వస్తున్నాయి



గ్రామాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రమైంది. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో కూడా కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో మధ్యాహ్న భోజన వంటల సమయంలో ఇబ్బంది పడుతున్నాం. పాఠశాలలో వంట కార్మికులతో పాటు పిల్లలను కుక్కలు కరిచి గాయపర్చాయి. కుక్కల సమస్యను పరిష్కరించాలి.

– అంకిరెడ్డి కళమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు, అర్వపల్లి

జాగ్రత్తగా ఉండాలి



కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. స్థానిక పీహెచ్‌సీలో రేబీస్ నివారణ మందులు అందుబాటులో ఉన్నాయి. కుక్కలు కరిచిన వెంటనే ఆ భాగాన్ని ధారగా పడే నీటి కింద పెట్టి సబ్బుతో పది నిమిషాల పాటు గట్టిగా కడగాలి. ఆ తర్వాత ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందాలి. కుక్క కరిచిన వారు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు కరిచిన రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు నాలుగు విడతలుగా తీసుకోవాలి. గాయాన్ని డ్రెస్సింగ్ చేయించుకోవాలి. భయపడకుండా టీకాలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు.

– డాక్టర్ చిలుకూరి మణిదీప్, మండల వైద్యాధికారి

నల్లగొండ పార్లమెంటు స్థానాన్ని గెలుస్తాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పటేల్ రమేష్ రెడ్డి

భానుపురి : రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాలతో పాటు నల్లగొండ పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకుంటామని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గం మట్టపల్లిలో జరిగిన నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశానికి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసం నుంచి సుమారు వందకారులతో భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, కౌన్సిలర్లు షఫీ ఉల్ల, వెలుగు వెంకన్న, నాయకులు గట్టు శీను, సైదిరెడ్డి, వల్దాసు దేవేందర్, నేరేళ్ల మధు పాల్గొన్నారు.

దాతకు విద్యార్థుల కృతజ్ఞతలు

నూతనకల్ : పదో తరగతి పబ్లిక్ వార్షిక పరీక్షలు రాయడానికి ఆటోను సమకూర్చిన దాతకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రంలో పరీక్షకు హాజరు కావడానికి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ తన సొంత ఖర్చులతో ఆటోను సమకూర్చారు. అలాగే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శనివారం ఆయనను సన్మానించారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష



చివ్వెంల : మాట్లాడుతున్న తహసీల్దార్ క్రిష్ణయ్య



అర్వపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్

చివ్వెంల : ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వాహకులు పకడ్బందీగా నిర్వహించాలని చివ్వెంల తహసీల్దార్ క్రిష్ణయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ధాన్యం తీసుకువచ్చే రైతులకు అవగాహన కల్పించాలని, ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందేలా చూడాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం పోసిన వెంటనే సంబంధిత రైతు పేరును నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏపీఎం రాంబాబు, సీసీలు వెంకన్న, ఉపేందర్, వీఓఏలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర లభించేలా రైతులకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అవగాహన కల్పించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. యాసంగిలో ధాన్యం కొనుగోళ్లపై సంఘబంధాల సభ్యులు, వీఓఏలకు శనివారం సెర్ప్ కార్యాలయంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉంటే ఏ– గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,203, బీ–గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,183 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి కేంద్రాలకు తెచ్చేలా చూడాలన్నారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏఓ ఆర్. శశిధర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, ఏఈఓ సత్యం, సీసీలు నగేష్, పద్మ, సంఘబంధం సభ్యులు, వీఓఏలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నిర్వాకం వల్లే రైతులకు కష్టాలు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే రైతులకు కష్టాలు వచ్చాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులు పగిలిపోవడంతో అక్టోబర్‌లో నీటిని మొత్తం వదిలేశారని, దాని కారణంగానే ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్లు తగ్గాయని తెలిపారు. చేసిందంతా చేసి చివరకు ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తున్నారని ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని తెలిపారు. నియోజకవర్గంలోని బిక్కేరు, మూసీ నదిలో ఉన్న ఇసుక మొత్తాన్ని గత ప్రభుత్వ హయాంలో ఖతం చేశారని, ఇసుక తీయడం వల్లే భూగర్భ జలాలు అడుగంటాయని అన్నారు. కేసీఆర్ వచ్చి మూసీ, బిక్కేరు వాగులను చూడాలని కోరారు. బిక్కేరు వాగుకు వచ్చి అక్కడ నాయకులు వేసిన 3కి.మీ రింగు రోడ్డును చూడాల్సిందిగా డిమాండ్ చేశారు. లిక్కర్ స్కాంలో ఇరికిన కవిత జైలుకు ఎందుకు పోయిందో ప్రజలకు చెప్పాలని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాల కాలంలో రైతుల కోసం కేసీఆర్ బయటకు వచ్చాడా అని ప్రశ్నించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో దళిత బంధు పథకంలో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని, దానిపై ఎందుకు ఎంక్వైరీ చేయలేదని విమర్శించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నాగారంలో భూకబ్జాలకు పాల్పడ్డాడని, 3 ఎకరాలు లేని వ్యక్తి 300 ఎకరాలు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాలన్నారు. నిజానిజాలన్నీ త్వరలోనే బయటకు వస్తాయని తెలిపారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ నియంతృత్వం వల్లే పార్టీ నాయకులంతా ఇతర పార్టీలకు వెళ్లిపోతున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో కోట్ల రూపాయలు గోల్‌మాల్ అయ్యాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ ఉద్యమ నాయకుల ఫోన్లన్నీ ట్యాప్ చేశారని విమర్శించారు. నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, పాలకుర్తి రాజయ్య, పైళ్ల సోమిరెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, యాదవరెడ్డి, జెమ్మిలాల్, వీరేష్, లక్ష్మయ్య, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, బత్తుల శ్రీను, రాము గౌడ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రఘునందన్‌రెడ్డి

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో రైతుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదివారం వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాక సందర్భంగా తిరుమలగిరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, నరోత్తమ్‌రెడ్డి, ప్రవీణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు తుంగతుర్తికి కేసీఆర్ రాక

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి శివారులో ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించడానికి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం వస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతోపాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం పానకం, సారా పట్టివేత.. కేసు నమోదు



ధరావత్ తండాలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిచారు. ఈ సందర్భంగా మామిళ్లమడవ ఆవాసం ధరావత్ తండా, పిర్యానాయక్ తండాల్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకం, 25 లీటర్ల సారా పట్టుబడ్డాయి. దీంతో పోలీసులు ఆయా తండాల్లోని నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య, సర్కిల్ ఎక్సైజ్ సీఐ రజిత, ఎస్ఐలు మూర్తి, గోపాలరావు, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు పోరెళ్ల దాస్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు పోరెళ్ల దాస్ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరిరావు అన్నారు. శనివారం పోరెళ్ల దాస్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంలో పోరెళ్ల దాస్ నైజాం ప్రభుత్వానికి, భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఉప్పలయ్య, కడెం లింగయ్య, సీహెచ్. సోమయ్య, అబ్రహం, కందుకూరి సోమయ్య, కొత్తగట్టు మల్లయ్య, రాంప్రభు, కిష్టునాయక్, యాకయ్య, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

కోదాడఅర్బన్ : యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన రైతు సంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడగంటడంతో వేల ఎకరాల పంట ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు అప్పుల పాలయ్యారని, వెంటనే వ్యవసాయ అధికారులు ఎండిపోయిన పంటలను పరిశీలించి ఎకరానికి రూ. 30వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వీరితో పాటు వందల ఎకరాలు కౌలుకు చేసిన రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఏనుగుల వీరాంజనేయులు, సంగమయ్య, మరియన్న, ఎం.ముత్యాలు, వెంకటేశ్, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



రెడ్డిగూడెంలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న పేర్ల నాగయ్య

మద్దిరాల : ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని రెడ్డిగూడెంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. దేశంలో నిత్యావసర వస్తువుల రేట్లు పెరుగుతున్నా.. ఉపాధి హామీ కూలి రేట్లు మాత్రం పెరగడంలేదని అన్నారు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వారికి దినసరి కూలి రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని అన్నారు. హెల్త్ వర్కర్స్ ఏనాడు కూడా పని ప్రదేశాన్ని సందర్శించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సామాఖ్య జిల్లా కన్వీనర్ గోద్దలి నర్సయ్య, నాగెల్లి శ్రీనివాస్, గుండాల వెంకన్న, నాగేంద్రచారి, ధనమ్మ, వెంకటమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విప్లవకారులను ఆదరించిన వ్యక్తి సత్తెమ్మ



సంతాపసభలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

ఆత్మకూర్(ఎస్) : పుప్పాల సత్తెమ్మ ఎందరో విప్లవకారులకు అన్నం పెట్టి ఆదరించిదని, ఆమె పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రం ఆవాసం పుప్పాలగూడెంలో టీపీటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పుప్పాల వీరన్న మాతృమూర్తి సత్తెమ్మ సంతాపసభను నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుప్పాలగూడెం గ్రామానికి ఘన చరిత్ర ఉందని అన్నారు. ఈ గ్రామం చంద్ర పుల్లారెడ్డి, పొట్ల రామ నరసయ్య వంటి యోధులు కలియతిరిగిన ప్రాంతమని అన్నారు. కామ్రేడ్ సత్తెమ్మ లాంటి అనేకమంది పార్టీ కోసం త్యాగాలు చేశారని, వారి త్యాగాలు గొప్పవని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పుప్పాల వీరన్న, రాష్ట్ర నాయకులు సుభాన్, పుప్పాల రవికుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, డేగల జనార్దన్, డాక్టర్ రంగారెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య, సబ్ డివిజన్ కార్యదర్శులు కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, బండి రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే మైబెల్లి, పుప్పాల మల్లయ్య, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, దండి ప్రవీణ్, మందడి శ్రీధర్, శ్రావణ్, శశి, రాజేష్, మెట్టు సోమయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



ఆత్మకూర్ (ఎస్) : పాతర్లపహాడ్‌లో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

ఆత్మకూర్(ఎస్) : పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 397 పశువులకు టీకాలు వేసినట్లు మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

అర్వపల్లి : పశువులకు రైతులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాల, ఆవాస గ్రామాల్లో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, యాదగిరి, గోపాల మిత్రలు ఆల్దాస్ లింగయ్య, సూరారపు అర్జున్, రైతులు పాల్గొన్నారు.

వ్యాపారులపై చర్య తీసుకోవాలి

నడిగూడెం : తరుగు పేరిట రైతులను దోచుకుంటున్న ధాన్యం వ్యాపారులు, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన నడిగూడెం మండల పరిధిలోని తెల్లబల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడా లేని విధంగా కేవలం కోదాడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం

అర్వపల్లి : భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించడం పట్ల మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి రెంటాల కరుణకుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి రావడంలో కిరణ్‌కుమార్‌రెడ్డి పాత్ర ఎంతో ఉందని చెప్పారు. తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయానికి ఎంతో కృషిచేశారని తెలిపారు. అత్యధిక మెజార్టీతో అతడి గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా గణేష్



తిరుమలగిరి : ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) తిరుమలగిరి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పానుగంటి గణేష్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, పానుగంటి నర్సింహారెడ్డి, జంపాల రాజేష్, మహేష్, రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

సూర్యాపేట రూరల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట మండలంలోని టేకుమట్ల జాతీయ రహదారిపై పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.లక్ష 50వేల నగదు పట్టుబడింది. శనివారం రాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి ఆశ్వాపురం వెళ్తున్న కారును తనిఖీ చేయగా నగదు పట్టుబడినట్లు ఏఎస్ఐ ముత్తయ్య తెలిపారు. సరైన ఆధారాలు చెప్పకపోవడంతో సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న వేషధారణ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు పలు రకాల వేషధారణ, వివిధ వృత్తులు, జీవన ప్రమాణాలపై నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుస్సా సులోచన మాట్లాడుతూ చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్

కోదాడఅర్బన్ : గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వేడుకల సందర్భంగా కోదాడ పట్టణంలో యునైటెడ్ పాస్టర్స్, క్రిస్టియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ యేసయ్య, తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు